క్లుప్తంగా

ఆవులు, పందుల సంచారంపై చర్యలు

సామర్లకోట: పట్టణంలో ఆవులు, పందులు సంచరించకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఏ శ్రీవిద్య తెలిపారు. ఇటీవల కాలంలో ఆవులు ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై నిద్రించడం వలన వాహన చోదకులు ప్రమాదాలకు గురి అవుతున్నట్లు గమనించామన్నారు. ఈ మేరకు ఆవుల యజమానులు వారి సంరక్షణలో ఉంచుకోవాలని సూచించారు. ఆవిధంగా చేయకపోతే పశువులను బందుల దొడ్డిలో పెడతామని చెప్పారు. పశువుల యజమానులు వస్తే అపరాధ రుసుం విధిస్తామన్నారు. అప్పటికీ రాకపోతే పశువులను గోశాలకు పంపుతామన్నారు. అదే విధంగా పందులు పట్టణంలో విచ్చల విడిగా తిరగడం వలన డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు రావడం జరుగుతుందన్నారు. పందుల పెంపకం దారులు పందులను పట్టణానికి దూరంగా ఉంచుకోవాలన్నారు. పశువులు, పందుల పెంపకం దారులు ఈ విషయాలను దృష్టిలో పెట్టుకోవాలని లేకుంటే ఈ నెల 14 నుంచి చర్యలు ప్రారంభమవుతాయన్నారు.

డాక్టరేట్ అందుకున్న యువకుడికి సత్కారం



యువకుడిని సత్కరిస్తున్న నాయకులు

సామర్లకోట: అతిచిన్న వయసులోనే డాక్టరేట్ అందుకున్న దేవగురు చంద్రశేఖర్‌ను జనసేన నాయకులు బుధవారం సత్కరించారు. ఇటీవల ఈయనను ఏషియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ అండ్ రీసెర్చ్ అకాడమీ డాక్టరేట్ బిరుదు ఇచ్చి సత్కరించింది. దేవగురు చంద్రశేఖర్ అపదలో ఉన్న వారిని గుర్తించి తన స్నేహితుల ద్వారా ఆదుకొంటున్నారు. దీనిని గమనించిన సంస్థ ఈ యువకుడికి డాక్టరేట్ బిరుదు ఇచ్చింది. ఈ సందర్భంగా జనసేన నాయకులు యువకుడిని సత్కరించారు. కార్యక్రమంలో సరోజ్ వాసు, పిట్టా జానకి రామారావు, మడగల శ్యామ్, మంచెం సాయి, పెంకే వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

సామర్లకోట: స్థానిక గోదావరి కాలువలో గుర్తు తెలియని మహిళ మృత దేహన్ని పోలీసులు వెలికి తీశారు. ఏఎస్సై సింహాద్రి కథనం మేరకు స్థానికుల సమాచారంతో కాకినాడ రోడ్డులోని సాంబమూర్తి రిజర్వాయరు ఎదురుగా ఉన్న గోదావరి కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు వెలికితీశారు. మహిళ మృతదేహంపై పసుపు రంగు లంగా, ఆకుపచ్చ రంగు జాకెట్టు మాత్రమే ఉందని తెలిపారు. మృతదేహాన్ని పెద్దాపురం మార్చురీకి తరలించడం జరిగిందన్నారు.

డంపింగ్ యార్డు కోసం స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మల్లిబాబు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీకి సంబంధించిన చెత్త వేయడానికి డంపింగ్ యార్డు నిర్మాణం కోసం స్థలాన్ని కాకినాడ ఆర్డీఓ మల్లిబాబు బుధవారం పరిశీలించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు, గొల్లప్రోలు పరిసర ప్రాంతాల్లో అనువైన స్థలాలను గుర్తించిన రెవెన్యూ అధికారులు.. ఆయా స్థలాలను ఆర్డీఓకు చూపించారు. వాటిని పరిశీలించిన ఆయన తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ఆయన వెంట గొల్లప్రోలు డిప్యూటీ తహసీల్దారు సౌజన్య, పలువురు రెవెన్యూ అధికారులు ఉన్నారు.

15 నుంచి పెద్దాపురంలో సీపీఎం జిల్లా మహాసభలు

పెద్దాపురం: భారత కమ్యూనిష్టు పార్టీ (సీపీఎం) కాకినాడ జిల్లా మహాసభలు ఈ నెల 15 నుంచి పెద్దాపురం పట్టణంలో నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.రాజశేఖర్ తెలిపారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో బుధవారం సీపీఎం పట్టణ కార్యదర్శి నీలపాల సూరిబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాజశేఖర్ మాట్లాడారు. భవిష్యత్తు పోరాటాలకు మహాసభ రూపకల్పన చేస్తుందన్నారు. మూడేళ్ల కాలంలో సీపీఎం చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. ప్రధానంగా ఏలేరు ఆధునికీకరణ పనులపై దృష్టి సారించకుండా ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయన్నారు. ఇసుక అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్ కొనసాగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా మహాసభలో కార్మికుల సమస్యలపై చర్చిస్తామని, ఈ నెల 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు నిర్వహించే మహాసభలను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కరణం ప్రసాదరావు, శాఖా కార్యదర్శి సిరిపరపు శ్రీనివాస్, డి.క్రాంతికుమార్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కూనిరెడ్డి అరుణ పాల్గొన్నారు.

ఇదేనా స్వచ్ఛ స్ఫూర్తి...!

- ప్రభుత్వ కార్యాలయాల వద్ద కానరాని మరుగుదొడ్లు
- పనుల నిమిత్తం వచ్చేవారికి తప్పని అవస్థలు

ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండాలని...ఆరుబయట మల విసర్జన వల్ల వ్యాధులు ప్రబలుతాయని అధికారులు ప్రజలకు అవగాహన కలిగించటం పరిపాటిగా మారింది. దీంతో మారుమూల గ్రామాల్లో సైతం వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్నారు. ప్రజలకు అవగాహన కలిగించటంలో విజయవంతమైన అధికారులు వారి కార్యాలయాలకు వివిధ అవసరాల నిమిత్తం వచ్చే వారిని మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. కార్యాలయాల వద్ద మరుగుదొడ్లు లేక వీరు ఎదుర్కొంటున్న అవస్థలు వర్ణనాతీతం.



పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కక్షిదారులు

పెద్దాపురం: పెద్దాపురం మండల కేంద్రానికి నిత్యం వివిధ పనుల నిమిత్తం పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ఎంతో మంది వస్తుంటారు. గ్రామీణ ప్రాంతాలకు మండల కేంద్రం పదుల కిలోమీటర్ల దూరంలో ఉన్నా పనులన్నీ అక్కడే జరుగుతాయి. భూ సమస్యల పరిష్కారం, రుణాలు, భూముల క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్లు, సబ్ ట్రెజరీ పనుల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు. డ్వాక్రా మహిళలు, కక్షిదారుల తాకిడి నిత్యం ఉంటుంది. ఈ క్రమంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పనుల కోసం వేచి చూసే వారికి కనీసం మూత్రశాలలు, మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ పథకాలను అమలు చేసే కార్యాలయాల వద్దే స్వచ్ఛ స్ఫూర్తి కానరాకపోవడం అధికారుల చిత్తశుద్ధికి అద్దం పడుతోంది.

పెద్దాపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, ట్రెజరీ, సబ్ జైలు, గృహ నిర్మాణం, ఉపాధి హామీ కార్యాలయం, వెలుగు మహిళా సమాఖ్య కార్యాలయం అన్నీ ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. ఈ కార్యాలయాలకు వచ్చే వారి కోసం కనీసం ఒక్క మరుగుదొడ్డి సైతం లేదు. దీంతో కార్యాలయాలకు వచ్చేవారు అత్యవసరమైతే నానా పాట్లు పడాల్సిన దుస్థితి దాపురించింది.

గోడ చాటే దిక్కు

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే మహిళల అవస్థలు వర్ణనాతీతం. మండల కేంద్రానికి వివిధ ప్రాంతాల నుంచి రోజుకు సుమారు 300 మంది వరకు ప్రజలు వివిధ పనులపై వస్తుంటారు. అత్యవసర సమయంలో మరుగుదొడ్డి అందుబాటులో లేకపోవడంతో కార్యాలయాల గోడల చాటుకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి



ప్రతీ రోజూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వివిధ అవసరాల నిమిత్తం వస్తుంటారు. మరుగుదొడ్లు లేక మహిళలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మాణం చేయాలి. – గుణ్ణం లక్ష్మణరావు, ఫర్ ద పీపుల్ ఫౌండేషన్ అధ్యక్షులు, పెద్దాపురం.

విక్రయాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించండి



ప్లాట్‌ఫాంపై స్టాల్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

సామర్లకోట: రైల్వే ప్లాట్‌ఫాంపై ప్రయాణికులకు విక్రయించే ఆహార పదార్థాలు, తినుబండారాలు నాణ్యతతో ఉండాలని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం రమేష్ ఆదేశించారు. స్వచ్ఛ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక రైల్వే స్టేషన్‌లోని ఫుడ్ ప్లాజా, ఫ్రూట్‌స్టాల్స్, జ్యూస్ స్టాల్స్, కూల్‌డ్రింక్స్ షాపులను రైల్వే అధికారులతో కలిసి తనిఖీలు చేశారు. ఆహార పదార్థాలు వేడిగా ఉండాలని ఫుడ్ ప్లాజా నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు. ఈ మేరకు ఆహారాన్ని రుచి చూశారు. ప్లాట్‌ఫాంపై ఉన్న స్టాల్స్‌లో విక్రయించే తినుబండారాల గడువు తేదీలను పరిశీలించుకోవాలన్నారు. నిల్వ పదార్థాలను విక్రయించడం నేరమన్నారు. ఎంఆర్‌పీ ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ మేరకు స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలపై ఫిర్యాదులు, సలహాలు స్వీకరించడానికి బాక్సులు ఏర్పాటు చేసినట్లు రమేష్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15 వరకు స్వచ్ఛ పఖ్వాడా కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఆర్‌పీఎఫ్ ఎస్సై ఎస్ రామకృష్ణ, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు తేజేశ్వరరావు, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టరు కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు కేవీ గిరి, టిక్కెట్టు చెక్కింగ్ ఇన్‌స్పెక్టరు చైతన్య, జూనియర్ ఇంజినీరు నాగార్జున, ఇతర రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

పంట సాగుపై అన్నదాతలకు అవగాహన



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు, రైతులు

పెద్దాపురం: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియెగం చేసుకోవాలని పెద్దాపురం మండల వ్యవసాయ శాఖ ఏడీఏ ఎస్.దైవకుమార్ అన్నారు. మండలంలోని కాండ్రకోట గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏఓ సంజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ దైవకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పంటలో తెగులు, చీడల గురించి వివరించారు. సామూహిక ఎలుకల నిర్మూలన, ఎర తయారీ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పశువైద్యాధికారి డాక్టర్ నవీన్ మాట్లాడుతూ ప్రస్తుత సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పశువులకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ప్రతీ రైతు పశువులకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎస్‌వీవీ ప్రసాద్, వ్యవసాయ సహాయకులు బి.రాగ ప్రవంతి, సత్తిబాబు, షేక్ బాలాజీ, టీడీపీ నాయకులు ఎలిశెట్టి సూర్య చక్రప్రకాష్, శానపల్లి శివచక్రరావు, రైతులు పాల్గొన్నారు.

శ్రీపాద వల్లభుని సన్నిధిలో దొరబాబు



శ్రీపాద శ్రీవల్లభ స్వామిని దర్శించుకుంటున్న పెండెం దొరబాబు

పిఠాపురం: మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు బుధవారం శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాద శ్రీవల్లభ స్వామిని బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలకగా, ఆయన స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. అధికారులు స్వామివారి ప్రసాదాలు ఇచ్చారు. ఆయన వెంట శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ రెడ్డెం జనార్ధనరావు, బాలిపల్లి రాంబాబు తదితరులు ఉన్నారు.

పాదగయ క్షేత్రంలో వంగా గీత



ఆశీర్వచనాలు అందుకుంటున్న వంగా గీత

పిఠాపురం: మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత బుధవారం పాదగయ క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేయగా, ఆమె కుక్కుటేశ్వర స్వామిని రాజరాజేశ్వరి దేవిని, పురుహూతికా అమ్మవారిని, దత్తాత్రేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేయగా, ఆలయ అధికారులు స్వామి వారి ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, కొత్తెం దత్తుడు, వులవల భూషణం తదితరులున్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి



దివ్యాంగుడికి బ్యాటరీ సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే తుమ్మల

పెద్దాపురం: దివ్యాంగుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం నిర్వహించిన దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో జనసేన పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు), భారతీయ జనతాపార్టీ పెద్దాపురం నియోజకవర్గ కన్వీనర్ విత్తనాల వెంకటరమణతో కలిసి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తోందని, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం నియోజకవర్గ పరిధిలో సుమారు 279 మంది దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లు, వీల్ చైర్లు, చేతి కర్రలు, వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డి శ్రీలలిత, ఎంపీపీ పెంకే సత్యవతి, టీడీపీ నాయకులు రాజా సూరిబాబు రాజు, అడబాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన ప్రదాయినీ నమోస్తుతే..!

- సరస్వతీదేవిగా రాజరాజేశ్వరీదేవి
- ఆలయాల్లో పూజలు, సామూహిక అక్షరాభ్యాసాలు



పాదగయలో విశేషాలంకరణలో పురుహూతికా అమ్మవారు



కొత్తపల్లి దుర్గాదేవి ఆలయంలో చేస్తున్న సామూహిక అక్షరాభ్యాసాలు, సరస్వతీ పూజలు

పిఠాపురం: శరన్నవరాత్ర ఉత్సవాలలో భాగంగా బుధవారం రాజరాజేశ్వరీదేవి అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పాదగయ క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వరీదేవి, అష్టాదశ శక్తి పీఠాలలో పదో శక్తి పీఠానికి అధిష్టాన దేవతైన పురుహూతికా అమ్మవారు విశేషార్చనలు నిర్వహించారు. కుక్కుటేశ్వరస్వామి వారికి అభిషేకాలు నిర్వహించగా, వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రాజరాజేశ్వరీదేవి అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమివ్వగా, వేద పండితులు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. పాదగయ క్షేత్రంలో వెలసిన సరస్వతీదేవి అమ్మవారి ఆలయంలో పలువురు విద్యార్థులతో సరస్వతీ పూజలు, చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయించారు. విద్యార్థులకు ఆలయ అధికారులు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. పిఠాపురంలో మహాలక్ష్మి, కన్యకాపరమేశ్వరి, గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి, దుర్గాడ లలితాదేవి ఆలయాల్లో అమ్మవార్లు సరస్వతీదేవిగా భక్తులకు దర్శన మివ్వగా, వేద పండితులు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు.

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన కాండ్రకోట నూకాలమ్మ, పెద్దాపురం మరిడమ్మ అమ్మవార్లు బుధవారం మహా సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల ఈవోలు సౌజన్య, విజయలక్ష్మిల ఆధ్వర్యంలో సామూహిక సరస్వతి పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు అమ్మవార్లను సరస్వతి అవతారంలో అలంకరించగా విద్యార్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహా సరస్వతి అవతారంలో భువనేశ్వరి అమ్మవారు

స్థానిక వర్జుల వారి వీధిలో వేంచేసిన శ్రీభువనేశ్వరి పీఠంలో బుధవారం భువనేశ్వరి అమ్మవారు మహా సరస్వతి అవతారంలో దర్శనమిచ్చారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో ఉదయం నుంచి పీఠంలో మండప ఆరాధన, అమ్మవారికి అయ్యవారికి అభిషేకాలు, అమ్మవారికి సహస్ర కుంకుమ పూజ, నవచండీ పారాయణం, శ్రీచక్రార్చన, చండీ హోమం నిర్వహించారు.

గ్రామాల్లో సామూహిక సరస్వతి పూజలు

మండలంలోని ఆనూరు, చదలాడ, పులిమేరు, గోరింట, గుడివాడ, సిరివాడ, చంద్రమాంపల్లి, దివిలి, తిరుపతి గ్రామాల్లో ఆయా అమ్మవార్ల ఆలయాల వద్ద ఆదివారం సామూహిక సరస్వతి పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో చిన్నారులు దుర్గ ఆలయాల వద్దకు చేరుకుని పెన్ను, పుస్తకాలను పూజల్లో ఉంచి పూజలు నిర్వహించారు.

సరస్వతీ పూజల్లో చిన్నారులు

సామర్లకోట: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆయా అమ్మవార్ల ఆలయాల్లో విద్యార్థులతో సామూహిక సరస్వతీ దేవి పూజలు, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. మండల పరిధిలోని పీబీ దేవం గ్రామంలోని శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరణ చేసి విద్యార్థుల చేత పూజలు చేయించారు. సేవా సమితి కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్, గౌరవ అధ్యక్షుడు వింజమూరి సుబ్రహ్మణ్య శర్మలు సరస్వతి పూజ వలన కలిగే ఫలితాలను విద్యార్థులకు వివ రించారు. గురువారం మహాష్టమిని పురస్కరించుకొని మహిళల చేత సామూహిక అష్టలక్ష్మీ పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పట్టణ పరిధిలో విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో విద్యార్థులతో సరస్వతీ పూజలు చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నెల్లిపూడి పావని, ఉప్పరపల్లి హారికల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సాంబాను నాగు, కొచ్చెర్ల ప్రసాద్, విజరపు ప్రకాష్‌లు చిన్నారులకు పెన్నులు, పుస్తకాలు అందజేశారు. సాయంత్రం చిన్నారులచే కోలాటం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు పాల్గొన్నారు.



పీబీ దేవంలో సామూహిక సరస్వతీ పూజలు



దుర్గాడ రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు, సరస్వతీ పూజలు



తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో అక్షరాభ్యాసాలు చేయిస్తున్న అర్చకులు



భువనేశ్వరి పీఠంలో సరస్వతీ పూజల్లో విద్యార్థులు



కొత్తపల్లి దుర్గాదేవి అమ్మవారు



మహా సరస్వతిగా కాండ్రకోట నూకాలమ్మ



సరస్వతీదేవిగా భువనేశ్వరి అమ్మవారు



సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన పాదగయ క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వరీ దేవి



తాటిపర్తి అపర్ణాదేవి అమ్మవారు



విశేషాలంకరణలో పాదగయ సరస్వతీదేవి